


కమల లేచిపోయిందన్న వార్త నాకు నారాయణ చెప్పే వరకూ తెలియదు.

తన భార్య పరాయి మగాడితో వెళ్ళిపోయిందన్న విషయం తన నోటితోనే చెప్పుకోవాల్సి రావటం కన్నా నికృష్టమైన శిక్ష మరొకటి వుండదని నా అభిప్రాయం.

పదేళ్ళ క్రిందట చూశాను కమలని. కమలం లానే కుసుమ కోమలంగా-చిత్రంగా నవ్వే చారడేసి కళ్ళతో-పొందిగ్గా-అందంగా వుండే కమల చప్పున నాకు ఆత్మీయురాలైంది. కొందరి మొహాల్లో అద్భుతమైన వెలుగు వుంటుంది-మనల్ని ఆకర్షిస్తూ. కొందరి మొహాల్లో అంతులేని ఆత్మీయత వుంటుంది-మనల్ని అల్లుకుంటూ.

"మీరు మా పెళ్ళికి ఎందుకు రాలేదు? నాకు బోల్డంత కోపం వచ్చింది మీమీద" నారాయణ భుజం మీద తల ఆన్చి అడిగింది. నేను నారాయణ వైపు చూశాను. అనంత సౌందర్యాన్ని ఒడిసి కౌగిట్లో లాక్కున్న క్షణం పొందే తన్మయత్వం అనుభవిస్తూ అరమోడ్పు కళ్ళతో కమలవైపే చూస్తున్నాడు.

జవాబు చెప్పలేదని కమల అలిగింది. అర నిముషం తర్వాత అన్నీ మరిచిపోయి పసిపాపలా నవ్వింది.

నారాయణ నిజంగా అదృష్టవంతుడే అనుకున్నాను.

నాతోపాటు పది వరకూ చదివిన నారాయణ అక్కడితో ఆపేసి ఆవారాలా తిరిగాడు. సన్నగా-పొట్టిగా-పరమ అర్భకుడిలా వుంటాడు. దానికితోడు తారుకన్నా బలమైన నలుపు-అటువంటి నారాయణకు-అప్సరసలాంటి భార్య దొరకటం అదృష్టం కాక మరేమిటి?

"ఎన్నిసార్లు చెప్పినా పెళ్ళే వద్దనే వాడివి-ఇప్పటికైనా పెళ్ళి చేసుకుని చాలా మంచిపని చేశావు" అన్నాను.

"నన్ను చూశాక దంగైపోయి తన అభిప్రాయాన్ని మార్చుకున్నట్టున్నారు" మురిపెంగా నారాయణ వైపు చూస్తూ చెప్పింది కమల. అలా అంటున్నప్పుడు తన అందంలో బలీయమైన ఆకర్షణ వుందన్న గర్వం ఆమె కళ్ళలో అరక్షణం మెరిసి మాయమైంది.

అందంగా వుండే ఆడవాళ్ళలో అందంగా వున్నామన్న అహంభావం ఓ ఆకర్షణలా మెరుగులు దిద్దుతో వుంటుందనుకుంటాను.

నారాయణ వేదాంతిలా నవ్వాడు. "లేదు హరీన్. నేనలా అనుకోవటం లేదు. పొరపాటు చేశానేమోనని పిస్తోంది."

ప్రశ్నార్థకంగా చూశాను.

"ఎదుగూ బొదుగూ లేని ఉద్యోగం. వెలకు నాలుగొందల జీతం. అందులోనే అన్నీ గడుపుకోవాలంటే నా కొక్కడికే కష్టంగా వుండేది. ఇపుడు రెండు ప్రాణాలు. పెళ్ళి కాకముందు-ఆనందాలూ, సంతోషాలూ అన్నీ హృదయ గతమైనవని అపోహ పడేవాడిని. ఇపుడు ప్రత్యక్షంగా తెలుస్తోంది-అవన్నీ ఆర్థిక స్థితి మీద ఆధారపడి వుంటాయని."

"ఆపేద్దురూ-ఎప్పుడూ డబ్బు గొడవేనా-ఇపుడు మనకేం తక్కువైందనీ-మనం సంతోషంగా లేమా?" కమల మురిపెంగా మందలించింది.

డబ్బు లేకున్నా ఆనందంగా వుండగలమన్న అవగాహన, ఆత్మ స్థైర్యం వున్న స్త్రీతో కాపురం పూల తేరుమీద ప్రయాణంలా వుంటుంది.

"హైదరాబాద్‌లో మీరేదో సంస్థని నడుపుతున్నారట?" టాపిక్ మారుస్తూ అడిగింది కమల.

నాకిష్టమైన టాపిక్. గంటల తరబడి మాట్లాడినా తనివి తీరని టాపిక్ నా సంస్థ-నా ఆరోప్రాణం-నా ఆదర్శం-నా జీవితం.

"పదేళ్ళ క్రితం కొంత మంది స్నేహితులతో కలిసి 'స్పందన' అనే సంస్థను ప్రారంభించాం. "పతితులార-భ్రష్టులార-బాధాసర్ప దష్టులార-ఏడవకండేడవకండి" అని చెప్పి వాళ్ళ కన్నీళ్ళు తుడిచే సంస్థ స్పందన. పసితనంలోనే మార్కెట్లోని వస్తువులా కొనబడి కండల్ని కరిగించి ఆ ఋణం తీర్చాలనే ముళ్ళ చట్రంలో బిగించబడిన అమాయక స్త్రీలు-గత్యంతరం లేక ఆ మురికి కూపంలో మగ్గే అనాథ యువతులు, ఏ తీయటి స్వాప్నిక లోకాల వెంటనో వెర్రిగా పరుగెత్తి-దగా చేయబడి, మోసగించబడి అలసి-శరీరాన్ని తాకట్టు పెట్టి అతి భయంకరమైన విజం లాంటి ఆకలిని చల్లార్చుకునే అభాగినులు-వీళ్ళ కోసం స్థాపించబడిన సంస్థ స్పందన. ఇలా చెప్తుంటే ఎంతటి ఆవేశం నాలో ఇంకా ఇంకా చెప్పాలని!

'ఎంత చక్కటి పేరు" కమల కళ్ళలో మెచ్చుకోలు. "ఆ పేరు మీరే పెట్టారా" కుతూహలంగా అడిగింది.

"అవును. అది నా హృదయంలోంచి ఉద్భవించిన ఆదర్శం-నా మనసులో జన్మించిన అద్భుతమైన ఆలోచన. దానికి తల్లినీ తండ్రినీ నేనే. అటువంటి అభా

## కాలాంతకునిలో



కలలు గనడానికి
నిద్రపోతాను
నిద్రపోతూ
కలలుగంటాను.
కలలాంటి జీవితాన్ని
కలగంటూ
వజ్రంలాంటి వాస్తవాన్ని
అనుభవిస్తూ
కార్యంలో కారణంలా
పానకంలో పంచదారలా
కలిసి పోతాను మట్టిలో
జీవమర్మమెరిగిన మట్టిలో
కాంతిలో వేడిలా
ప్రవాహంలో నీటిలా
కదలి పోతాను కాలంతో
మట్టి మర్మ మెరిగినకాలంతో...
తొడిమలో పువ్వులా
నారికేళంలో నీరులా
కాపురముంటాను
కాలపుటంచులనుదాటి
కాలమర్మమెరిగిన
కాలాంబరునిలో
కాలాంతకునిలో

—డా. సి.ఎం. మోహన్రావ్

గిమలను చూపి స్పందించే హృదయంకల వ్యక్తుల కలయికతో స్థాపించ బడింది కాబట్టి దానికి స్పందన అని పేరు పెట్టడం జరిగింది."

"మీ సంస్థ అటువంటి వ్యక్తుల కోసం ఏం చేస్తుంది" నిజమైన ఆసక్తిని కనబరుస్తూ అడిగింది కమల.

"మా సంస్థకు కొన్ని నియమాలున్నాయి. శరీరాన్ని అమ్ముకొనే స్త్రీలు నిజాయితీగా-దృఢంగా ఆ వ్యాపారాన్ని అసహ్యించుకుంటూ కొత్త జీవితం ప్రారంభించాలని- గౌరవంగా బతకాలని కోరుకుంటేనే ఆశ్రయం దొరుకుతుంది. అటువంటి స్త్రీలు శరీరాన్ని మాత్రమే అమ్ముకుని వుంటారు. వారి ఆత్మలు అమలినంగానే వుంటాయి. అటువంటి స్త్రీలను చేరదీసి వారికి అనుగుణమైన వృత్తిపనులు నేర్పి వాళ్ళ కాళ్ళమీద వాళ్ళు నిలబడటానికి మా సంస్థ దోహదం చేస్తుంది. అంతే కాదు- ఆదర్శ యువకులు ఎవరైనా ముందుకు వస్తే వాళ్ళ వివాహాలు కూడా జరిపిస్తాం."

"ఎంత గొప్ప ఆదర్శం! మీలాంటి ఉన్నతమైన వ్యక్తులు నా భర్తకు స్నేహితులు కావడం మా అదృష్టం". చేతులు జోడించి నమస్కరించింది కమల.

ఎంత అందమైన నేర్పు! ఆ అమ్మాయిలో ఎంత అందమైన అవగాహన-నారాయణ నిజంగా అదృష్టవంతుడు అన్న సంతృప్తితో హైదరాబాద్ తిరిగి వచ్చేశాను. మరలా పదేళ్ళ తర్వాత నారాయణ వచ్చి చెప్పే వరకూ కమల నా స్మృతి పథంలో అద్భుతమైన స్త్రీలానే వుండిపోయింది.

"ఎలా జరిగింది?" అని అడిగాను. నాకింకా నమ్మకం కలగటం లేదు. కమల లాంటి స్త్రీ-చదువు లేకున్నా సంస్కారం-ఆలోచన కల స్త్రీ అలాచేస్తుందంటే నమ్మలేక పోతున్నాను.

అరవైయేళ్ళ వృద్ధుడిలా వున్నాడు నారాయణ. మాసిపోయిన గెడ్డం-ముడుతలు పడిన చెంపలు-దైన్యం నిండిన కళ్ళు-చప్పున జాలేసింది నాకు. మరొకరి జీవితాన్ని తెలిసి తెలిసీ నాశనం చేసే అధికారం ఎవ్వరికుంది? ఎంతటి అమానుషం కాకపోతే ఎవరైతే మన జీవితాన్ని ఆనంద మయం చేస్తారని-కష్టాల్ని పంచుకుని, సుఖాల్ని పెంచు తారని ఆశిస్తామో-వాళ్ళే అనంతమైన దుఃఖాన్ని మన నెత్తిన కుమ్మరించి వెళ్ళిపోవటం...ఎంతటి దారుణం! వీళ్ళు శరీరాల్ని కాదు-మనసుల్ని-ఆత్మల్ని హత్య చేస్తారు-జీవచ్ఛవంలా-ఎంతటి దయనీయమైన బతుకో-

నారాయణ కళ్ళనిండా నీళ్ళు ఉబికాయి. స్వరం గాద్గదిక మైంది. "ఇద్దరు పిల్లలు పుట్టే వరకూ నాకు తెలియనే లేదు హరీష్-తనకు చాలా మందితో సంబంధా లున్నాయని! ఓ రోజు అన్నీ నిజాలని ఆధారాలతో సహా నాకు నమ్మకం కలిగిన రోజు-అతి ఉదారంగా అనంతమైన క్షమతో-కరుణతో చెప్పాను-ఇకముందు అలా చేయ వద్దని. పిల్లల భవిష్యత్తుని దృష్టిలో వుంచుకునైనా సవ్యంగా వుండమని చెప్పాను. అలా చెప్పిన వారానికే ఓ లారీ డ్రైవర్‌తో వెళ్ళిపోయింది" నారాయణ వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. ఎలా ఓదార్చాలో తెలియలేదు నాకు.

నారాయణను 'స్పందన'కు పిల్చుకెళ్ళాను. చాలా ప్రశాంతమైన వాతావరణం. దారి పొడవునా అందమైన చెట్లు-అతి పొందిగ్గా నిర్మించిన అందమైన కుటీరాలు. వాటికి నేను పెట్టిన కవితాత్మకమైన పేర్లు-

"నీవు ఆ వూరిలోనే వుండటం పిల్లల భవిష్యత్తు దృష్ట్యా అంత మంచిది కాదు నారాయణా. ఇక్కడే వుండిపో...ఈ వాతావరణం నీకు కొంత మనశ్శాంతి నిస్తుంది. పిల్లల్ని తెచ్చేసుకో. గతాన్ని గురించి బాధ పడకు. కొందరు వ్యక్తుల గురించి తల్చుకోవడం కూడా పాపమే. వాళ్ళు క్షమకూ-ఔదార్యానికీ అర్హులు కారు" అన్నాను.

నారాయణ కళ్ళనిండా కృతజ్ఞత.

దూరంగా గులాబి మొక్కలకు నీళ్ళు పోస్తోంది సుజాత. ఆవిడ సామీప్యం తనకు ఆనందాన్నిస్తుందని బాహాటంగా చాటుకుంటూ గులాబీలు పరవశంతో తలలూపుతున్నాయి. సుజాతని నేనే బంధవిముక్తురాల్ని చేసి స్పందనలో చేర్పించాను. మనసున్న మనిషి సుజాత. నా మనసులో ఓ అందమైన వూహ చోటుచేసుకుంది. నారాయణను సుజాతనీ మార్చి మార్చి చూశాను. ఒకరు తెల్లగులాబీ-మరొకరు నల్లగులాబీ-రంగులోనే తేడా- సంతృప్తిగా తలపంకించి నారాయణకు ఆఫీస్‌లో పని అప్పగించి వచ్చేశాను.

* * *

నారాయణ పిల్లల్ని తెచ్చేసుకున్నాడు. అతను కొంత స్థిమితపడ్డాడని అనిపించాక - ఓ రోజు సాయంత్రం నారాయణని మా ఇంటికి పిల్చుకెళ్ళాను. లాన్‌లో ఇద్దరం కుర్చీలు వేసుకుని కూచున్నాం-సూర్యాస్తమయపు నీరెండ నారాయణ ముఖం మీద పడి వింతగా కనిపిస్తోంది. ఇద్దరం కాఫీలు సిప్ చేస్తున్నాం. ఇది చాలా సరియైన సమయం అనిపించింది.

"నారాయణా - పిల్లలు చిన్నవాళ్ళు కదా - నీకు కష్టం కావటం లేదా" అని అడిగాను ఉపోద్ఘాతంలా.

"కష్టంగానే వుంది. ఏం చేయను - తప్పదు కదా"

"నా ఉద్దేశంలో పిల్లలు పుట్టాక జీవితోద్దేశమే మారిపోతుంది. పిల్లల్ని సక్రమంగా పెంచటం - వాళ్ళను అన్ని విధాలుగా చక్కగా తీర్చి దిద్దటమే జీవిత పరమావధి అయిపోవాలి. నీ పిల్లలు ఇంకా పసివాళ్ళే! ఆడదాని సహకారం లేకుండా వాళ్ళను పెంచినా - వారి వ్యక్తిత్వంలో పరిపూర్ణత రాదు. అందుకే నువ్వు మరో

## చేతుల్లేని చెట్లు



మా ఇంటి ముందు
సామాజికారణ్య
శాఖవారలు మొన్న
చక్కని మొక్క
నాటి వెళ్లారు
నిన్నటికది చెట్టు.
కొమ్మల రెమ్మల కొండంత ఎదిగి
చల్లని నీడలు జల్లేటి చెట్టు.
నేడు చూతును గదా,
నీడలే లేవు.
కొమ్మల చేతులూ రెమ్మల వేళ్ల
విరిగి పడున్నాయి
వెక్కుతూ మాను
వైద్యుత శాఖీయులుద్యమించిరట
తీగల కడ్డని తెగనరికిరట!
నారుపోయునొకడు
నరికిపోవునొకడు.

—'చేలా'

పెళ్ళి చేసుకోవటం మంచిదని నా అభిప్రాయం"

"ఒకసారి చేసిన తప్పుని మరలా చేయటం విజ్ఞత అనిపించుకోదు హరీష్. అయినా నాకు స్త్రీ జాతి మీద వున్న గౌరవం, నమ్మకం పోయాక మరే స్త్రీని నా జీవితంలోకి ఆహ్వానించలేను"

"ఎవరో ఓ స్త్రీ అలా చేసిందని పూర్తి స్త్రీ జాతినే అసహ్యించుకోవటం సమంజసం కాదు. మనసా, వాచా, కర్మణా భర్తకే అంకితమౌతానని పెళ్ళినాడు ప్రమాణం చేసి - ఆ భర్తనే వంచించి పరాయి మగాడితో తిరిగే స్త్రీ తప్పకుండా స్త్రీ జాతికే అవమాన కరమైనది. మనం వ్యభిచారుల్ని అసహ్యించుకుంటాం కానీ, ఓ విధంగా ఆలోచిస్తే వ్యభిచారం అసహ్యించుకోవాల్సిన పని కాదు. జాలి పడాల్సిన పని. ఎందుకంటే వాళ్ళు ఎవర్నీ మోసం చేయటం లేదు. ఎవరి నమ్మకాల్నీ వమ్ము చేయటం లేదు. ఎవర్నీ దోచుకోవటం లేదు. తమ శరీరాల్ని, ఆరోగ్యాన్ని, వయసుని ఇతరులకి దోచి పెట్టి, కడుపుకి కాసింత గంజినీళ్ళు సంపాయించుకుంటున్నారు. భర్త చాటున పరాయి మగాడితో తిరిగే స్త్రీలే నిజమైన వేశ్యలు - అతి నికృష్టమైన స్త్రీలువాళ్ళే. కానీ పొట్టకూటి కోసం శరీరాన్ని అమ్ముకునే ఈ నిర్భాగ్యులు - వీళ్ళు పవిత్రులు! మరో విషయం గమనించావా - ఇటువంటి స్త్రీలు తమని నమ్మిన ఏ మగవాణ్ణీ ఎప్పటికీ మోసం చెయ్యరు కాదంటావా" అన్నాను.

నారాయణ మాట్లాడలేదు.

జాగ్రత్తగా వింటున్నాడని నిర్ధారించుకుని అడిగాను-

"సుజాత నీకు తెల్సు కదా - చాలా మంచి పిల్ల... వయసులో వున్నప్పుడు ఎవర్నో నమ్మి మోసపోయింది. వాడు ఈ అమ్మాయిని వ్యభిచార గృహంలో అమ్మేసి తన దారిన తాను పోయాడు. ఆ వృత్తిలో వున్నన్నాళ్ళూ ఆ వృత్తిని అసహ్యించుకుంటూ - ఏ కొద్ది ఆధారం దొరికినా బైట పడాలని తాపత్రయ పడ్తూ బతికింది. అందుకే ఆమె ఆత్మ - మనసూ - హృదయం ఎప్పటికీ పవిత్రమైనవే. నువ్వు ఒప్పుకుంటే ఆ అమ్మాయి జీవితానికి ఓ ఆధారం దొరుకుతుంది. నీ పిల్లలకు ఓ తల్లి దొరుకుతుంది. ఏమంటావ్?"

"నేను మరో స్త్రీని ఆహ్వానించటానికి ఇష్ట పడడం మొదటి విషయం హరీష్- ఆ తర్వాతే ఆమె ఎవరనే



విషయం - నువ్వు చెప్పినట్లు నాకు స్త్రీలంటే అసహ్యం వున్నా - నా పిల్లలకు ఓ స్త్రీ అవసరం చాలా వుంది. సుజాత నిజంగానే మంచి మనిషి - మనసున్న మనిషి - ఎటొచ్చీ నాక్కొంత వ్యవధి ఇవ్వు-" నారాయణ నిర్వికారంగా సమాధానం చెప్పాడు.



"సరే - నీ ఇష్టం. [illegible] ఒకటి గుర్తుంచుకో - జీవితంలో ఒక్కోసారి మనకు తెలియకుండానే అదృష్టం తలుపు తడుతుంది. [illegible]ష్టమని తెలుసుకున్నాకే నిన్నడిగాను. [illegible] త్వరగా నీ విషయమూ చెప" అన్నాను.

* * *

నారాయణ పెళ్ళికి ఒప్పుకున్నాడు.

గాంధీ జయంతి నాడు పెళ్ళి చేయాలని నిశ్చయించుకున్నాం. అంటే మరో పదిహేను రోజులు. నేను చాలా బిజీ అయిపోయాను. ఈ పెళ్ళికి వీలైనంత ఎక్కువ పబ్లిసిటీ ఇవ్వాలని నా కోరిక.

ఓ రోజు ఆదినారాయణ చాలా ఆదుర్దాగా నా దగ్గిర కొచ్చాడు.

"హరీష్ - నీతో అర్జంటుగా మాట్లాడాలి. అలా వెళ్ళి మాట్లాడుకుందాం" అని తొందర చేశాడు.

దార్లో అడిగాను "ఏమిటి విషయం" అని.

"కమల ఉత్తరం రాసింది" అన్నాడు. చాలా ఆశ్చర్యం వేసింది నాకు. అనుకోని సంఘటన ఇది.

"ఎప్పుడు రాసింది? ఏమని రాసింది" అని అడిగాను.

"ఇది మూడో ఉత్తరం హరీష్. ఇంతకు ముందు రెండు ఉత్తరాలు రాసింది. వాటికి నేనంత ప్రాముఖ్యత ఇవ్వలేదు. కాబట్టి నీకు చెప్పలేదు. కానీ ఈసారి ... "

నారాయణ స్వతహాగా మంచి వ్యక్తి. దానికి తోడు చాలా జాలి గుండె.

పరిస్థితి నా చేజారి పోతున్నట్లనిపించింది.

"పశ్చాత్తాప పడ్తున్నానని రాసి వుంటుంది. అంతేనా ... నువ్వు నమ్మేసి రెండు చేతులూ సాచి ఆమెను ఆహ్వానించాలని ఉబలాట పడ్తున్నావు!" అక్కసునంతా గొంతులో నింపుకుని అన్నాను.

"మొదటి రెండు ఉత్తరాలు చదివినప్పుడు నేనూ అలానే అనుకున్నాను. పిల్లల్ని చూడాలని వుందనీ - తను చేసిన తప్పుని క్షమించమని రాసినప్పుడు వాడు వదిలేసి రోడ్డు మీద పడి వుంటుందని - అందుకే అలా రాసి వుంటుందనీ అనుకున్నాను. కానీ ఈ ఉత్తరం ... ఇదిగో నువ్వే చదువుకో" అని ఓ వుత్తరం నా చేతిలో పెట్టాడు. నా కళ్ళు వేగంగా ఆ అక్షరాల వెంట పరుగెత్తాయి.

"మీరు క్షమిస్తారన్న ఆశతో ఇన్నాళ్ళు బతికి వున్నాను. దేవుడిలాంటి మీకు అన్యాయం చేశాను. చాలా దయనీయమైన స్థితిలో వున్నాను. ఆదరిస్తారన్న ఆశతో తల్లి దండ్రుల దగ్గిరకెళ్తే తమకెలాంటి సంబంధం లేదని గెంటేశారు. దిక్కులేని దానిలా పడి వున్నాను. చివరి ఆశ మీరు మాత్రమే! ఎన్నోసార్లు నేను చేసిన తప్పుల్ని క్షమించి ఆదరించారు. చివరిసారిగా ఒక్క అవకాశం ఇవ్వండి చాలు. అడ్రస్ క్రింద ఇస్తున్నాను. వెంటనే వచ్చి పిల్చుకెళ్ళండి. మీరు రాకపోతే నాకు మరణమే శరణ్యం"

అని వ్రాసి వుంది.

"ట్రాష్ - తినటానికి తిండి లేదు కాబట్టి ఇన్ని సూక్తులు వల్లిస్తోంది. రేపు సరైన తిండి దొరికిన నాడు మళ్ళీ బజార్న పడుతుంది" నాలో టెన్షన్ పెరిగి పోతోంది. పెళ్ళి ఏర్పాట్లన్నీ జరిగిపోయాయి. పెళ్ళికి చీఫ్ గెస్ట్‌గా సంక్షేమ శాఖ మంత్రిణి వస్తు న్నారు. పేపర్లలో వేయటం జరిగింది. పాంప్లెట్లు పంచటం జరిగింది. ఇంత జరిగాక ఏమైనా అయితే నా "స్పందన" పరువేం అయిపోతుంది? లేదు - అలా జరగటానికి వీల్లేదు.

"నువు అమాయకుడివి కాబట్టి నిన్ను అలా ఆడించింది. నీ వీక్ పాయింట్స్ తెల్సు కాబట్టి మరలా నిన్ను

## (విద్యా) వ్యాపారం

ఏం బ్రదర్ వ్యాపారం చేస్తావా?
అయితే లాభాల తేనెపట్టు
ఓ కాన్వెంటు పెట్టు
ఆల్ఫా, బీటా, గామానో పేరుగా పెట్టు
పిల్లల తల్లిదండ్రుల్ని
ముప్పు తిప్పలు పెట్టు
ఎందుకైనా మంచిది

ఓ మినిస్టరు బామ్మర్దిని కాకాపట్టు
ఇక నీ పొట్టె విరిగి నేతిలో పడ్డట్టు
కనక వర్షం కురవక పోతే నీ మీదొట్టు

విద్యా ప్రమాణాలా!
ఓరి మూర్ఖా!!
వ్యాపారానికేం పనికొస్తాయోయ్?!

—రాజన్

ఉచ్చులో దిగించటానికి ప్రయత్నిస్తోంది. నారాయణా - ఇలాంటి స్త్రీలు మారతారనుకోవటం కలలోని మాట. నీలాంటి ఉత్తమమైన వ్యక్తిని - అంతగా ప్రేమించి, క్షమించిన వ్యక్తిని సైతం మోసం చేయగలిగిన స్త్రీ ఎంతటి ఘోరానికి అయినా పాల్పడగలదు. ఇక అటువంటి స్త్రీని మర్చిపోవటం మంచిది. ఆమె క్యారెక్టర్ ప్రభావం నీ పిల్లల మీద తప్పకుండా పడ్తుంది. అందుకే అలాంటి ఆలోచనలు పెట్టుకోకన - ఏమంటావు" అన్నాను.

"నిజంగా పశ్చాత్తాప పడ్తున్నట్లనిపిస్తోంది హరీష్. చాలా నిస్సహాయంగా వుంది. ఇటువంటి పరిస్థితుల్లో మరో అవకాశం ఇవ్వటం న్యాయమనిపిస్తోంది."

గుండెల్లో బాంబులు పడ్డట్టయింది నాకు.

"ఎన్ని అవకాశాలిచ్చినా ఆ రక్తంలో ఇంకి పోయిన వ్యసనం ఎన్నటికీ మారదు నారాయణా - ఇక్కడ నీకు లభిస్తున్న ప్రశాంతమైన జీవితంలో అమాయకంగా అలజడి సృష్టించుకుంటున్నావ్. మలినమైన ఆత్మలూ, మలినమైన హృదయాలూ వున్న స్త్రీలతో కాపురం చేయటం దుర్భరం. నిన్ను కాదని మరో వ్యక్తిని ప్రేమించి - కామించి - ఇష్టపడిన స్త్రీని మనసారా మరలా కోరుకోవటం నీ మంచితనం కాదు - మూర్ఖత్వం - నీ చాతకానితనం"

"సరే. నువ్వే చెప్పు ఏం చేయాలో" అసహనంగా అన్నాడు నారాయణ.

ఆ ఉత్తరాన్ని ముక్కలు ముక్కలుగా చించి వేశాను.

### ఆడది

సెంటిమెంట్‌కీ,
బలహీనతలకు
అనురాగానికీ
ఇంకా తలవంచుకుని
వున్నది కాబట్టే
యాభై పైసలు
విలువ చేసే
పసుపుతాడు
కోసం
యాభై వేలు
తగలబెడుతోంది

—కె.జె. మహర్షి

"ఇంకెప్పుడూ కమలను తల్చుకోవద్దు" అన్నాను దృఢంగా - బేలగా నా వెంట నడిచాడు నారాయణ.

* * *

పెళ్ళి ఇంకో రెండ్రోజులుందనగా "స్పందన" ఆఫీస్‌లో ముఖ్యమైన పని చూసుకుంటున్నాను. అప్పుడు ప్రభంజనంలా దూసుకొచ్చింది నా గదిలోకి కమల - నిర్ఘాంత పోయి చూశాను - ఆమె జుట్టంతా రేగిపోయి వుంది. మనిషి వికృతంగా తయారయింది. దవడలు పీక్కుపోయి ఎముకలు బైటికి పొడుచుకు వచ్చి కన్పిస్తున్నాయి. కళ్ళు అఘాతాల్లో కూరుకు పోయినట్లు నిస్తేజంగా వున్నాయి. ఒంటి మీద చీర మాసి పోయి పీలికలై వుంది.

నేను అప్రయత్నంగా లేచి నిలబడ్డాను. కమల నా ముందు కొచ్చి ఓసారి తూలి నిలదొక్కుకుని నిలబడింది.

"నువ్వు ఇదంతా ఎందుకు చేస్తున్నావో నాకు తెలుసు. నీకు పేరు రావాలి. నీవో పతిత జీవితాన్ని ఉద్ధరించావని పత్రికలు పొగడాలి. ఏ ఆధారం లేని నేను కూడా ఆకలికి తట్టుకోలేక, రేపు ఏ వేశ్యాగృహంలోనో కొన్నాళ్ళు కుళ్ళిపోతే - అప్పుడు వచ్చి సంఘ సంస్కర్తలా నన్ను విడిపించి, నీ ఔదార్యాన్ని చాటుకుంటావు. నిన్ను ఒకే ఒక ప్రశ్న అడుగుతాను-బురదలో కూరుకు పోయిన వ్యక్తిని లేపి ప్రక్షాళించి కొత్త బట్టలు తొడగడం సంస్కరణ అయితే - ఆ బురదలోకి పడబోతున్న వ్యక్తిని పడకుండా ఆపటం సంస్కరణ కాదా - నీ స్పందనలోని వ్యక్తులు అటువంటి వాళ్ళ కన్నీళ్ళు చూసి స్పందించరా - నీకు నువ్వే ఓ స్త్రీని బురదలోకి తోసేసి - తర్వాత ఎప్పుడో అటువంటి స్త్రీని బైటికి లాగి పునీతం చేయాలనుకునే నీ సంస్కారమూ ఓ సంస్కారమేనా - ఇదేనా సంఘ సంస్కరణ - ఛీ" అని ఎంత విసురుగా వచ్చిందో అంత విసురుగా బైటికెళ్ళిపోయింది.

కానీ - ఆ గదిలో ప్రతిధ్వనిస్తో - నా ఎదురుగా - కమలలా బలంగా, దృఢంగా, ధైర్యంగా నిలబడి - తను వేసిన ప్రశ్న మాత్రం మిగిలి పోయింది.

